క్లుప్తంగా

మాజీ మంత్రి లక్ష్మిదేవమ్మ వర్ధంతి



లక్ష్మిదేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఉన్న మాజీ మంత్రి లక్ష్మీదేవి విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు నివాళులర్పించారు.మంగళవారం పట్టణంలో మాజీ మంత్రి లక్ష్మీదేవి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ కాంతమ్మ, కౌన్సిలర్ లక్ష్మన్న, పట్టణ కన్వీనర్ సుధీర్, జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శి సత్తి, జిల్లా కోర్డినేటర్ సెక్రెట్రీ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, వైఎస్ఆర్‌సీపీ మహిళ నాయకురాలు చందన శివాజి, మండల జేసీఎస్ కన్వీనర్ అంజనేయులు, నాయకులు హనుమంతురాయుడు, బాబు, మురళి, హరి పాల్గొన్నారు.

కంబదూరులో నివాళి



లక్ష్మిదేవమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కంబదూరు: మండల కేంద్రంలో మాజీ సీడబ్ల్యూసీ మెంబర్, మాజీ మంత్రి లక్ష్మిదేవమ్మ 15వ వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్‌సీపీ నాయకులు,కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. లక్ష్మిదేవమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు గోవింద్,తిమ్మరాయుడు, డాక్టర్ బొమ్మయ్య, యువజన నాయకుడు బీమేష్, మండల కన్వీనర్ కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, పట్టణ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, మహిళా నాయకురాలు చందన శివాజీ, కుటుంబ సభ్యులు శ్రీధర్, నరసింహమూర్తి, శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేష్, రాళ్లపల్లి గంగాధర్, బేల్దారి హనుమంతరాయుడు, వెట్టి జయన్న, వడ్డే ప్రసాద్, కిరణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నాగేపల్లిలో చోరీ

కుందుర్పి: మండంలోని నాగేపల్లిలో రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయం చూసి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 13 గ్రాముల బంగారం, రూ.70 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు అన్నదానం చేస్తున్న ముత్తలూరి అశోక్, పీహెచ్‌సీ వైద్యాధికారి

ఉరవకొండ: రాకెట్ల పీహెచ్‌సీలో గర్భిణులకు పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్తలూరు అశోక్ మంగళవారం అన్నదానం చేశారు. తన సోదరుడు ముత్తలూరు ఓబన్న, వదిన విశ్రాంత ముత్తలూరి భారతలక్ష్మి జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్‌నాయక్, వైఎస్సార్‌సీపీనేత ముత్తలూరు అశోక్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ దెయ్యాల నాగరాజు, ఉప సర్పంచ్ రామిరెడ్డి, సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ, శేఖర్, స్వర్ణలత పాల్గొన్నారు.

1265 క్వింటాళ్ల కందుల కొనుగోలు



కందులు తూకాలు వేస్తున్న దృశ్యం

కూడేరు: లక్ష్మీనరసింహ మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున పి.నారాయణపురం, కూడేరులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాల్లో 1,265 క్వింటాళ్ల కందులు కొనుగోలు చేసినట్లు ఆ సొసైటీ ప్రతినిధి మనోహర్ రెడ్డి, ఏఓ విజయకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రానికి బ్రాహ్మణపల్లి, గొటుకూరు, రామచంద్రాపురంతో పాటు మరి కొన్ని గ్రామాల నుంచి కందులను రైతులు తీసుకొచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లలితమ్మ, ఏఈఓ శైలజ, వీఏఏలు రాజకుమార్ , సాజియా, ఎంపీఈఓ సరస్వతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలను అడ్డుకోవాలని, బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలని పట్టణ సీఐ యువరాజ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బాలికల హాస్టల్‌లో బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ యువరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలన్నారు.

వేసవి రాకనే మండే ఎండలు

- 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో పగటి ఉష్ణోగ్రతలు
- ఫిబ్రవరిలోనే మొదలైన వేడి, ఉక్కపోత
- గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి తగ్గుముఖం
- రానున్న రోజుల్లో మరింత ప్రభావం చూపనున్న భానుడు



వడదెబ్బ లక్షణాలు.. వడదెబ్బ సోకిన వారిలో శరీర ఉష్ణోగ్రత 105.1 కంటే ఎక్కువగా ఉంటుంది. నీరసంగా కనిపిస్తారు. శరీరంలో ఉన్న లవణాలు తగ్గి, సమతుల్యత లోపించి అలసట, తలనొప్పి, తల తిరగటం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.



రాయదుర్గంలోని కణేకల్లు రోడ్డులో నిర్మానుష్యం

రాయదుర్గం: చలికాలం ఇంకా పోలేదు..వేసవి రాకముందే ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ భానుడు భగభగమంటున్నాడు. ఎండల తీవ్రతకు జనం అల్లాడిపోతున్నారు. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పెరగడంతో చలి తగ్గుముఖం ఫిబ్రవరి నెలలోనూ వేడి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో ఉన్నాయి. రానున్న రోజుల్లో భానుడు మరింత ప్రభావం చూపనున్నాడు. రాయదుర్గం, కళ్యాణదుర్గం , ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ ఎండ తీవ్ర అధికమైంది. ఉదయం 9 గంటలు దాటితే రోడ్డెక్కాంటే భయపడాల్సి వస్తోంది. శివరాత్రి రాకనే భానుడు భగ భగ లాడిస్తున్నాడు. ఉదయం, రాత్రి వేళల్లో మినహా చలి తీవ్రత పూర్తిగా తగ్గింది. చుట్టూ దట్టమైన కొండలు ఉండడంతో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే రాయదుర్గంలో వేడి తీవ్రత మరింత ఎక్కువగానే ఉంటుంది. దీంతో ఆరంభంలోనే సగటు ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ 32 డిగ్రీలు దాటుతోంది. మార్చిలో మండిపోక తప్పదు. ఏప్రిల్, మే నెలల్లో నిప్పుల కొలిమిని చూడాల్సి వస్తోంది. మధ్యాహ్నం పూట ప్రధాన కూడళ్లు, రోడ్లలో జన సంచారం తక్కువైంది. ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండలకు భయపడి గొడుగు నీడలో కొందరు ప్రయాణం సాగిస్తున్నారు. మరికొందరు టవ్వాళ్లు, చేతి రుమాలు చుట్టుకొని వెళ్తున్నారు. వచ్చే నెల నుంచి పరీక్షల సీజన్ మొదలు కానుండడంతో విద్యార్థులకూ అవస్థలు తప్పేలా లేవు. ఎండల తీవ్రత పెరగడం వల్ల శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, మంచినీటి పాకెట్లకు డిమాండ్ పెరిగింది. ఎండకాలం ముగిసే వరకు పాటించాల్సిన జాగ్రత్తపై వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

వడదెబ్బ వల్ల మనిషి శరీరంలో నీరు చమట రూపంలో బయటకు వెళ్లిపోతుంది. డీహైడ్రేషన్‌తో మూత్ర విసర్జన భారం అవుతుంది. కొన్ని సందర్భాల్లో షాక్‌కు గురై మూర్ఛపోవడం, మృత్యువాత పడే ప్రమాదమూ ఉంది. వడదెబ్బకు గురికాకుండా సాధ్యమైనంత వరకు ఎండలో తిరగడం తగ్గించుకోవాలి. శరీరం వేడెక్కినట్లు కనిపిస్తే చల్లటి నీటితో స్నానం చేయాలి. పండ్ల రసాలు, చెరుకు రసం చీనీరసం, బెల్లం పాణకం ఎక్కువ తీసుకోవడం వల్ల త్వరగా ఉపశమనం కలుగుతుంది. రోజూ వీలైనంత ఎక్కువగా నీరు తీసుకోవాలి.

పిల్లలతో జాగ్రత్త



ఎండల ప్రభావం పెరుగుతోంది. చిన్న పిల్లలు ఎండలో తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్తే టోపీ లేదా మెత్తని దుస్తులు కప్పి తీసుకెళ్లాలి. చిన్నారులపై వేడి ప్రభావం ఎక్కువైతే వెంటనే వడదెబ్బ లేదా జ్వరం వచ్చే అవకాశం ఉంది. ఇది మామూలు జ్వరం కన్నా భిన్నంగా ఉంటుంది. ఎండల పట్ల పెద్దలు కూడా జాగ్రత్తలు పాటించాలి. వేసవి రాకనే ఉష్ణోగ్రతలు ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. రాబోవు రోజుల్లో ఎండత తీవ్రతతో మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వేసవి ముగిసే వరకూ జాగ్రత్తలు పాటించడం మంచిది.

– డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ, మెడికల్ సూపరింటెంట్, రాయదుర్గం

పదో పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



పదోతరగతి మాదిరి ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఉరవకొండ (వజ్రకరూరు): మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని చాబాల సర్పంచ్ మల్లెల జగదీష్, ఎంఈఓ తిమ్మప్ప పిలుపు నిచ్చారు. మంగళవారం వజ్రకరూరు మండలంలోని చాబాల జెడ్పీహెచ్ఎస్‌లో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన మాదరి ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ప్రతినిధి లాలుసాహెబ్ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేంద్రప్ప, ఉపాధ్యాయులు కరణం శ్రీనివాసరావు, పీడీ లక్ష్మీప్రసాద్, హ్యూమన్‌రైట్స్ ప్రతినిధి దాదాహనీఫ్, ఎస్ఎంసీ సభ్యులు లేపాక్షి పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన

గుమ్మఘట్ట: బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలతో అనర్థాలపైన , సైబర్ క్రైం, బ్యాడ్‌టచ్ గుడ్‌టచ్, ట్రాఫిక్ నిబంధనలపై వివరించారు. చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉరవకొండ: స్థానిక కాయగూరల మార్కెట్ వద్ద పీజీఎస్ చలివేంద్రాన్ని ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఎస్ఐ జనార్దన్‌నాయుడు మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా పీజీఎస్ మహబూ, పీజీఎస్ ఖాజా సోదరులు పాదచారులు, వాహనచోదకులకు ప్యూరిఫైడ్ నీరు అందిస్తున్నట్లు తెలిపారు.

11 యుకెడి 08: ఉరవకొండలో పీజీఎస్ తాగునీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దంపతులు పాపన్న, పాపమ్మ

రాయదుర్గంటౌన్: 74 ఉడేగోళం గ్రామ సమీపంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ద్విచక్ర వాహనాన్ని మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఉడేగోళం గ్రామానికి చెందిన భార్యాభర్తలు పాపన్న, పాపమ్మ పొలం పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. గ్రామానికి సమీపంలోని సర్కిల్ వద్ద రాగానే వెనుక వైపు నుంచి రాయదుర్గం నుంచి అనంతపురానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పట్టాభిరాముడికి ఎమ్మెల్యే పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు మోసుకెళ్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం: పట్టాభిరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. మంగళవారం ఉదయం ధర్మవరం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వస్త్రాలను స్వామికి సమర్పించారు. ఉదయం 8 గంటలకు కుంభ పూజ, నిత్యహోమం, గ్రామ బలి, ఆస్థాన మండప సేవ, ఉత్సవ విగ్రహాలకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా లక్ష పూలను స్వామికి సమర్పించారు.

కమనీయం..నవనారసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవ దృశ్యం



ఆకట్టుకున్న భరత నాట్య ప్రదర్శన

రాయదుర్గంటౌన్: మండలంలోని మల్లాపురంలోని విప్రమలై క్షేత్రంలో కొలువుదీరిన లక్ష్మీ నవ నారసింహస్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కల్యాణకట్ట వద్ద లక్ష్మీసమేత కల్యాణమూర్తుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాయదుర్గంతో పాటు సరిహద్దు కర్ణాటకలోని అనేక ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 5 జంటలకు సామూహిక వివాహ కార్యక్రమం జరిపించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు, సీఐ జయానాయక్, ఎస్ఐ బాలరాజు హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం శ్రీవారి రథాంగహోమం, మడుగుతేరు, బ్రహ్మ రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు తిప్పేస్వామి తెలిపారు.

30 మంది భక్తులు శ్రీవారి దీక్షామాలధారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కార్యదర్శి గురు, కోశాధికారి సత్యనారాయణ, నరసింహులు, వెంకటేశులు, ప్రచార కార్యదర్శి కమలాక్షుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశానికి అధికారుల గైర్హాజరుపై నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి

బ్రహ్మసముద్రం : మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరుపై సభ్యులు అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖ అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బరాయుడు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో నీటి ఎద్దడిని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బొమ్మగానిపల్లి, రాయలప్పదొడ్డి సర్పంచులు మాట్లాడుతూ బొమ్మగానిపల్లి, రాయలదొడ్డి, కన్నేపల్లి ప్రధాన రహదారి అంతా గుంతలమయమైందన్నారు. ఉపాధిహామీ, నీటి పారుదల, వ్యవసాయ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభావతి, తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ రంగనాయకులు, ఎంఈఓ 2 కృష్ణనాయక్, వెటర్నరీ డాక్టర్ నవీన్‌కుమార్, వైస్ ఎంపీపీ సునందమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మీ, సర్పంచులు అంజినమ్మ, ఆదినారాయణ రెడ్డి, రామ్మోహన్, గోవిందప్ప , పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండుటెండలో 'మధ్యాహ్న' అగచాట్లు



మండుటెండలో భోజనం కోసం క్యూకట్టిన విద్యార్థులు, అక్కడే మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీదేవి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో డిప్యూటీ డీఈఓ శ్రీదేవి సమక్షంలోనే మధ్యాహ్న భోజన నిర్వహణ మంగళవారం గందరగోళంగా కనిపించింది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 600 మందికిపైగా విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వంటగది ఉన్నా ఆరు బయటే భోజనం వండి వడ్డిస్తున్న పరిస్థితి కనిపించింది. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ప్లేట్లు పట్టుకొని మండుటెండలో భోజనం కోసం క్యూకట్టడం కనిపించింది. ఉపాధ్యాయులతోపాటు మధ్యాహ్న భోజన నిర్వహణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణకు వచ్చిన డిప్యూటీ డీఈఓ సమక్షంలోనే విద్యార్థులు అవస్థలు పడడం కనిపించింది. దీంతో నిర్వహణ తీరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం కోసం ఎండలో విద్యార్థులు క్యూకట్టి నిలబడడం ఏమిటని ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి, నిర్వాహకులను ప్రశ్నించారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల తీరుపై ఫిర్యాదు



డిప్యూటీ డీఈఓ శ్రీదేవికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల తీరు, స్కూల్‌లో నెలకొన్న సమస్యలపై గుత్తి డిప్యూటీ డీఈఓ శ్రీదేవికి ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ మోడల్ స్కూల్‌లో తనిఖీకి వచ్చిన డిప్యూటీ డీఈఓను కలిసి మాట్లాడారు.

విచారణ నివేదికను డీఈఓకు అందిస్తాం : మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, సిబ్బందితో విచారించినట్లు చెప్పారు. నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు చెప్పారు. డీఈఓ ఆదేశాల మేరకే మంగళవారం మోడల్ స్కూల్‌లో విచారణతోపాటు మధ్యాహ్న భోజనం, హాస్టల్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. విచారణ వివరాలను పూర్తిస్థాయి నివేదికతో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. విచారణలో ఎంఈఓ–2 వెంకట రమేష్ ఉన్నారు.

మారని వైద్యాధికారి తీరు



ఖాళీగా ఉన్న వైద్యాధికారి కుర్చీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి తీరు మారలేదు. ఈనెల 6న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి ఆస్పత్రిని తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వైద్యసేవలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైద్యాధికారిని మందలించారు. ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. దీంతో రోగులకు సేవలు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గర్భిణులు సూక్ష్మ పోషకాలు తీసుకోవాలి

- ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ



శిక్షణ కార్యక్రమ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ తెలియజేశారు. మంగళవారం స్థానిక కేవీకేలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో ఐటీసీ వారి ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 60 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సూక్ష్మ పోషికాహారంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దర్గయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, ఎదిగే పిల్లలు తప్పనిసరిగా సూక్ష్మ పోషికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం స్థూలపోషక ఆహారం, సూక్ష్మ పోషక ఆహారంపై వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రాయుడు, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, శాస్త్రవేత్తలు, హరిణి, డాక్టర్ చంద్రశంకర్, ఐజీడీ స్టాఫ్ సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, పోతులయ్య, రోహన, రమణమ్మ, ఐదు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

కళ్యాణదుర్గం రూరల్: శెట్టూరు మండలం పరిధిలోని లక్ష్మంపల్లికి చెందిన ఓ విద్యార్థిని సోమవారం నుంచి కనిపించలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థిని కళ్యాణదుర్గంలోని జ్యోతిర్మయి కాలేజ్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి చేరుకోలేదు. మంగళవారం కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిస్తే సెల్: 9346119358 తెలపాలని పట్టణ పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర బస్సు సర్వీసును నడపాలి

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నుంచి ధర్మవరం – కర్ణాటక రాష్ట్రం చెళ్లికెరకు అంతర్రాష్ట్ర ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును మంగళవారం కోరారు. కళ్యాణదుర్గం మీదుగా ధర్మవరం– చెళ్లికెర ఆర్టీసీ సర్వీసును ఏర్పాటు చేస్తే వ్యాపారపరంగా అభివృద్ధి చెందొచ్చని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

14న మోగా జాబ్ మేళా

ఉరవకొండ: ఈనెల 14న ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మోగా జాబ్ మేళాను ఏపీ నైపుణ్యాభివృద్ధి, డిగ్రీ కళాశాల జేకేసీ విభాగం సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటీకేలు పూర్తి చేసిన వారికి జాబ్ మేళాలో అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 7013800115లో సంప్రదించాలన్నారు.

యూనిక్ ఐడీ నంబర్ తప్పనిసరి

కూడేరు: ప్రతి రైతూ తప్పని సరిగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం నెంబర్, సెల్ ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ విజయ కుమార్ మంగళవారం తెలిపారు. 45 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే యూనిక్ ఐడీ నంబర్ (విశిష్ట గుర్తింపు నంబర్) వస్తుందన్నారు.

మోసగాళ్లతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: మాయమాటలతో మోసం చేసే వారిపై విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ నబీరసూల్ అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినులు అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తూనే చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారత్ గ్యాస్ ఏజెన్సీపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వినియోగదారుల నుంచి గ్యాస్ ధరల కన్నా అధికంగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఈమేరకు తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పీఆర్ పెన్నప్ప, నాయకులు భీమరాజు, కొత్తపల్లి, ఆనంద్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.